# వలపాతం

ఉదయపు ఎండ వరండాలోకి వచ్చింది. మధ్యగదిలో వసుమతి సోఫాలో చేరగిలబడి కూర్చుని దినపత్రిక చూస్తోంటే కాలింగ్ బెల్ మోగింది. లేచి వెళ్ళి తలుపు తీయాలనిపించలేదు. ఉదయం ఆరింటి నుండి ఎందుకో ఒకందుకు బెల్ మోగుతూనే ఉంటుంది. భర్త ఉంటే అతనే వెళ్లి వీధి తలుపు తీస్తుంటాడు. పనిమనిషి ఉన్నప్పుడు ఆమె తీస్తుంది. పనిమనిషి ఇంట్లో ఉంది.

కాళిదాసు వస్తాడనే నమ్మకం వసుమతికి పోయింది. ఈ ఊరు ఎందుకు వచ్చాడో, ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. మనిషేం మారలేదు. తన పెళ్ళికి ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలానే ఉన్నాడు. తన పెళ్ళయి ఇది ఆరో సంవత్సరం. తన స్వస్థలానికి ఇంత దూరంలో అతన్ని మళ్ళీ చూస్తుందని అనుకోలేదు. ఆలోచనల్లోంచి పూర్తిగా తొలగిపోలేదు. అప్పుడప్పుడు గుర్తు వచ్చే వాడు. అతను తన కన్నా తన భర్త గంగాధర్‌కు దగ్గర బంధువు. ముందురోజు గంగాధర్ ఆఫీసుకు వెళ్తోంటే స్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లో కాళిదాసు నిలబడి ఉండడం చూసి, కారులో ఎక్కించుకుని తీసుకు వచ్చాడు. అయిదు నిమిషాలు పాటు కాళిదాసుతో మాట్లాడి గంగాధర్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అప్పటికే ఆలస్యం అవడం వలన కాళిదాసుతో ఎక్కువ సేపు మాట్లాడలేకపోయాడు.

గంగాధర్ ఆఫీసు ఉదయం ఎనిమిదింటికి మొదలవుతుంది. ఆఫీసుకు వెళ్తూ అయిదు సంవత్సరాల కూతురును తన కూడా తీసుకెళ్ళి స్కూల్లో వదిలిపెట్టి తిరిగి సాయంత్రం నాలుగున్నరప్పుడు ఆఫీసు అయిపోగానే స్కూలు నుండి తీసుకువస్తుంటాడు. మా కూతురు స్కూలు గంగాధర్ ఆఫీసుకు దగ్గరగా ఉంది.

కాలింగ్ బెల్ మళ్ళీ మోగింది. పని మనిషి వెళ్ళి వీధి తలుపు గడియ తీసింది. కాళిదాసు లోపలికి రాగానే, తలుపు దగ్గరగా వేసి వంట గదిలోకి వెళ్లిపోయింది. వరండాలో గోడకానుకుని నిలబడి షూ విప్పుకుంటోంటే వసుమతి

గదిలోంచి అతన్ని చూసింది. పలకరించాలనిపించలేదు. అతను వేసుకున్న బట్టలు మాసిపోయి మట్టి కొట్టుకున్నట్టుగా ఉన్నాయి. ముందు రోజు దాదాపు ఈ సమయానికే బయటకు వెళ్ళిన వ్యక్తి ఏమేమి చేశాడో, ఎక్కడెక్కడ తిరిగాడో, ఏమో ఇప్పుడీ విధంగా ఇంటికి చేరాడు. కాళిదాసు మీద ఆమెకు కోపంగానే ఉంది.

అతనూ వసుమతిని చూశాడు. పలకరించకుండా లోపలికి వెళ్ళి పోయాడు. ముందు రోజు బయటకు వెళ్లే ముందు తనతో నవ్వుతూ బాగానే మాట్లాడాడు. ఒకప్పటి కాళిదాసులానే అనిపించాడు.

పది నిమిషాలు గడిచాక వసుమతి పని మనిషి బాయమ్మను పిలిచి, "అతనికి టీ ఇవ్వు" అంది.

"ఇచ్చానమ్మా, తాగారు," అంది బాయమ్మ.

"లోపల ఏం చేస్తున్నాడు?"

"స్నానాల గదిలోకి వెళ్లారమ్మా."

"టిఫిను ఏమయినా ఉందా, చేయాలా?"

"ఉప్మా ఉందమ్మా."

"అతని కోసం ఉప్మా డైనింగ్ టేబుల్ మీద పెట్టి నువ్వు వెళ్లేప్పుడు అతనికి చెప్పి వెళ్లు."

"సరేనమ్మా".

అరగంట తర్వాత పనులు ముగించి బాయమ్మ వెళ్లిపోతూ వసుమతి చెప్పి, వీధి తలుపు దగ్గరగా వేసింది.

వసుమతి చేతిలో దినపత్రిక అలానే ఉంది. చదవాలన్న ధ్యాసమటుకు కదిలిపోయింది. కాళిదాసు ఇంటికి తిరిగి వచ్చాక గాని ఆమె మనసు కుదట పడలేదు. నిన్న ఉదయం టిఫిను చేస్తూ అతను బయటకు వెళ్ళొస్తానంటే, "వెళ్లకపోతేనేం?" అంది తను, ఆ సమయంలో అతను బయటకు వెళ్ళడం ఇష్టమనిపించలేదు. లోగడ అతను ఎవరి మాట వినకపోయినా తన నెప్పుడూ కాదనలేదు.

వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కుని తను అందించిన తువ్వాలుతో చేతులు తుడుచుకుని తువ్వాలు కుర్చీ మీద పెట్టి "ఇరవయి నిమిషాల్లో తిరిగొస్తాను... మహా అయితే అరగంట" అన్నాడు.

"తిరిగి రావడానికి దారి తెలుసు కదా?" అడిగింది.

"తెలుసు, ఈ ఊరు మరీ కొత్తేకాదు."

"నా భయం తప్పిపోతావేమోనని."

"ప్రతిసారి ఎవరూ తప్పిపోరు" అన్నాడు.

అతనికి వసుమతి దగ్గరున్న చనువు గంగాధర్ దగ్గర లేదు. గంగాధర్ ముందు వసుమతి కాళిదాసుతో అట్టే మాట్లాడదు.

"వంద రూపాయలుంటే ఇవ్వు, రేపిచ్చేస్తాను." అన్నాడు.

నవ్వి, "ఇస్తాను, అప్పుడెప్పుడో తీసుకున్న బాకీ అలానే ఉంది. తీర్చలేదు." అంది.

"తీరుస్తాను. నా రోజులు బాగాలేవు."

"ఎప్పటి నుండో అంటున్నావు. వింటున్నాను. బాగుపడడం నీకే ఇష్టం లేనట్టుగా ఉంది."

"ఇలా శాపాలు పెడుతోంటే ఏం బాగుపడతాను?" అన్నాడు.

పడక గదిల్లోకి వెళ్ళి అయిదు వందల రూపాయల నోటు తెచ్చి అతనికిస్తోంటే తీసుకుంటూ ఆమెకు దగ్గరగా వచ్చాడు. అతను బయటకు వెళ్ళడం ఆలస్యమయింది.

అరగంటలో తిరిగి వచ్చేస్తానన్న కాళిదాసు గంటయినా, రెండు గంటలయినా రాలేదు. భోజనం చేయడానికి మధ్యాహ్నమయినా రాత్రి పది దాటినా రాలేదు. ఎక్కడికి వెళ్ళాడో వసుమతికి తెలియదు. అతనికి ఆ ఊళ్లో స్నేహితులు ఎవరయినా ఉన్నారో, ఉంటే ఎక్కడ ఉన్నారో ఆమె అడగలేదు. సెల్ ఉన్నట్టు అనిపించలేదు. తమ ఇంటి ఫోను నెంబరు కాని, సెల్ నెంబరు కాని అతను అడగలేదు. ఇంటిదారి మర్చిపోడానికి అతను చిన్న పిల్లాడేం కాదు. అతను తెచ్చుకున్న ఎయిర్‌బేగ్ ఇంట్లోనే ఉంది. అందులో ఈ ఊరి అడ్రసున్న కాయితం ఏమయినా దొరుకుతుందేమోనని

వెతికింది. నాలుగు జతల మాసిపోయిన బట్టలు తప్ప మరేమీ కనిపించలేదు. అసలతను ఈ ఊరికి ఎందుకు వచ్చినట్టు? అతని బట్టలన్నీ ఉతికి చొక్కాలు, పంట్లాంలు ఇస్త్రీ చేయించింది. తనూ గంగాధర్ భయపడిందేమిటంటే కాళిదాసు ఊరుకాని ఊళ్లో ఏ ప్రమాదానికయినా గురి అయ్యాడేమోనని!

గంగాధర్‌కయితే కాళ్లూ, చేతులు ఆడలేదు. పోలీసు కంట్రోలు రూంకు ఫోనుచేసి కాళిదాసు వివరాలు చెప్పి వాళ్ల దృష్టికి ఏ ప్రమాదమయినా వచ్చిందేమోనని అడిగాడు. ఏం రాలేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు, టి.వి. వాళ్ళకు, పత్రికాఫీసులకు రాత్రి చాలా సేపటి వరకు ఫోన్లు చేస్తూండిపోయాడు. తనకు రాత్రి మూడింటి వరకు నిద్రపట్టలేదు. 'కాళిదాసుకు ఏ ప్రమాదం జరగకూడదు. అతను క్షేమంగా ఉండాలి. పెళ్లి చేసుకుని పిల్లా పాపలతో సుఖంగా బతకాలి' అని పదే పదే అనుకుంది.

ఈ ఉదయం గంగాధర్ ఆఫీసుకు వెళ్ళేప్పుడు, "ఒకవేళ వాడొస్తే వాడి ఎయిర్‌బాగ్ వాడి ముఖాన కొట్టి బయటకు వెళ్ళి పొమ్మను. నేను అన్నట్టుగా చెప్పు" అన్నాడు. కాళిదాసు మీద అతనికి కోపంగానే ఉంది. అతను ఇంట్లో ఉండగా కాళిదాసు తిరిగివచ్చి ఉండుంటే ముక్కతిట్లు తిట్టుండేవాడు. గంగాధర్‌కు సామాన్యంగా కోపం రాదు. వస్తే పట్టుకోవడం కష్టంగానే ఉంటుంది.

కాళిదాసు ఉప్మాతినడం ముగించి వసుమతి కూర్చున్న సోఫాకు ఎదురుగా వచ్చాడు. కూర్చోవాలో, వద్దో అని తటపటాయిస్తోంటే ఆమె అతన్ని గమనించనట్టు కిటికీలోంచి బయటకు చూస్తూ భర్తకు ఫోను చేసి, "కాళిదాసు వచ్చాడు." అంది.

"రాత్రంతా ఎక్కడ చచ్చాడట? కోపంతో అరిచాడు.

"నేను అడగలేదు. అతనితో మాట్లాడాలని అనిపించడం లేదు" అంది. క్షణం ఆగి, "నువ్వు అతనితో మాట్లాడతావా?" అడిగింది.

"వాడితో నేను మాట్లాడ దల్చుకోలేదు".

కాళిదాసు తరుపున ఆమె వకాల్తా తీసుకోదల్చుకోలేదు.

అతడు ఫోను పెట్టేశాడు. ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది.

"సారీ... నా మూలాన..." అంటోంటే అతని ముఖంలోకి చూసి, అతని మాటలకు అడ్డు తగులుతూ, "నువ్వు చేసే పనులన్నీ ఇలానే ఉంటాయి...." అంది.

ఆమె మాటలు పూర్తి కాలేదు. అతను చటుక్కున ఆమె కాళ్ల దగ్గర కూర్చుని ఆమె పాదాలు పట్టుకున్నాడు. ఆ హఠాత్ చర్యకు ఆమె ఆశ్చర్యపోయింది. "ఛ ఏమిటి కాళీ ఈ పనులు?" అంటూ కాళ్ళు వెనక్కు లాక్కోబోయింది. అతను వీలు కానీయ లేదు. అతని చేతులు వేడిగా ఉన్నాయి.

"నన్ను క్షమించు. ఇద్దరికీ కోపం తెప్పించాను. ఫోను చేసి చెబుదామనుకుంటే మీ ఫోను నెంబర్లు నాకు తెలియవు. నిన్న బయటకు వెళ్ళేప్పుడు తీసుకుందా మనుకుంటూనే మర్చిపోయాను."

"అసలు ఎక్కడికి వెళ్లావు? నీకేదయినా ప్రమాదం జరిగిందేమోనని ఇద్దరం భయపడ్డాం నాకు చాలాసేపటి వరకు నిద్ర పట్టలేదు."

"ఒక స్నేహితుడిని కలుసుకుందామని వెళ్లాను. వాడు దొరకలేదు. ఫ్యాక్టరీకి వెళ్ళాడట. వస్తాడని ఎదురు చూస్తూ కూర్చున్నాను. రాత్రి పది దాటినా వాడు రాలేదు. తిండీ, తిప్పలు లేవు. వాడింటికి దగ్గర్లో ఏ హోటలూ లేదు. భాష రాదు. తిరిగి మీ ఇంటికి రావడానికి ఒక బస్సు ఎక్కబోయి పొరపాటున మరో బస్సు ఎక్కాను. అది ఊరు శివార్లోకి తీసుకు వెళ్ళి వదిలి పెట్టింది. సిటీ బస్టాప్‌లో నిద్ర పోయి ఉదయం లేచి, రెండు మూడు బస్సులు మారి ఇక్కడకు వచ్చేసరికి ఇప్పుడయింది. మీకు చాలా ఇబ్బంది కలిగించాను...."

పలచగా, తెల్లగా ఉండే ఆమె పాదాలను అతను చాలా ఇష్టపడతాడు. అంతకు ముందు ఆ పాదాలను చేతుల్లోకి తీసుకుని ఎన్నో సార్లు ముద్దు పెట్టుకున్నాడు. కాళ్లకు బంగారపు పట్టాలున్నా తీసేస్తాడు. అతని పెదాల వేడికి ఆమెకు చక్కలిగిలి పెట్టి నట్టుగా ఉంటుంది. అతను ఆమె మీంచి తన చేతులు తీయలేదు.

"కాళ్ళు వదులు కాళీ, చేసే తప్పులు చేస్తూనే ఉంటావు. ఇలా కాళ్ళు పట్టుకుంటుంటావు. నువ్వు మారవు. ఇప్పుడు నువ్వు చెప్పినవేవీ నిజం అనుకోను. అబద్ధాలు చెప్పడం కూడా చాతకాక పోతే ఎలా?" అంది కోపం చల్లబడుతోంటే...

అతను ఆమె కాళ్లు వదిలి లేచి నిలబడి, "నిన్న జరిగింది మీ ఆయనకు చెబుతావేమోనని భయపడ్డాను." ఆగి, ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమె నవ్వి తలఅడ్డంగా ఆడించి, "లేదు. చెప్పలేదు. చెబుతానని ఎలా అనుకుంటున్నావు? కూర్చో..." అని దినపత్రిక అటు నెట్టి పక్కనున్న చోటు చూపించింది.

అతను కూర్చోలేదు.

"మళ్ళీ బయటకు వెళ్ళే పనుందా? అడిగింది.

"లేదు."

వసుమతి లేచి నుంచుని, పయిట భూజాల నిండా కప్పుకుని, "ఆయన, పాప సాయంత్రం వరకు రారు. వీధి తలుపు గడియవేసి పడక గదిలోకి రా." అని సెల్ ఫోను తీసుకుని అతన్ని రాసుకుంటూ పడకగదిలోకి నడిచింది. ఎ.సి ఆన్ చేసి గది కిటికీలు ఒక్కొక్కటి మూయ సాగింది. వదులయిన చీర కుచ్చెళ్ళు జారి పోకుండా ఎడమ చేత్తో పట్టుకుని, కుడి చేత్తో చివరి కిటికీ తలుపులు మూయబోతూ బయటకు చూసింది.

అప్పటికే కాళిదాసు కాంపౌండు గేటు దాటి రోడ్డు మీదకు వెళ్తూ కనిపించాడు. అతని భుజానికి తను తెచ్చుకున్న ఎయిర్‌బేగ్ ఉంది. చెప్పా పెట్టకుండా ఎందుకు వెళ్ళిపోతున్నాడో ఆమెకు అర్థం కాలేదు.

"కాళీ" పిలిచింది.

ఆ మాట అతనికి వినబడింది. అయినా ఆగలేదు. వెనక్కి తిరిగి చూడలేదు.

* విపుల, మాసపత్రిక, ఆగస్టు 2010